నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 25 మే 2024 | HYDERABAD


## రెండు రోజులు.. మోస్తరు వానలు

జూబ్లీహిల్స్, మే 24: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గ్రేటర్‌లో రాగల రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శుక్రవారం నగరంలో గరిష్ఠం 39.7, కనిష్ఠం 26.9 డిగ్రీల సెల్సియస్.. గాలిలో తేమ 43 శాతంగా నమోదైనట్లు వెల్లడించారు. కాగా, రెండు రోజులతో పోలిస్తే నగరంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత తప్పడం లేదు.




ప్రయాణికులకు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేందుకు తన వాహనంపై పచ్చటి గడ్డిని పేర్చిన ఓ ఆటో వాలా



మణికొండ పంచవటి కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

# సెల్లార్లు తవ్వితే.. క్రిమినల్ కేసు

## వర్షాకాలం ప్రారంభం నుంచి సెప్టెంబర్ చివరి వరకు నిబంధన

### త్వరలో మార్గదర్శకాలు జారీ

సిటీబ్యూరో, మే 24, (నమస్తే తెలంగాణ): వచ్చే నెల మొదటి వారం తర్వాత వర్షాలు ప్రారంభ సమయం నుంచి సెల్లార్ తవ్వకాలపై నిషేధం విధించాలని బల్దియా సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రతి ఏడాది మాదిరిగానే వర్షాకాలం ప్రారంభం నుంచి సెప్టెంబర్ నెల చివరి వరకు సెల్లార్ తవ్వకాలపై నిషేధం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సెల్లార్ తవ్వకాలపై మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తామన్నారు. వర్షాకాలం జాగ్రత్త చర్యల్లో భాగంగా పురాతన, శిథిల భవనాలతో పాటు సెల్లార్ల తవ్వకాలపై ఫోకస్ పెట్టిన బల్దియా.. ఎట్టి పరిస్థితుల్లో సెల్లార్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్న ప్రతి బిల్డర్ రక్షణ చర్యలు చేపట్టాలని, రక్షణ గోడ నిర్మాణం, పని జరుగుతున్న ప్రదేశం చుట్టూ బారికేడింగ్, సెల్లార్‌లో నీరు నిల్వకుండా చూసుకోవాల్సి ఉంటుందని అధికారులు సూచించారు.

**మార్గదర్శకాలివి..**

వర్షాకాలం ప్రారంభం నుంచి ముగిసే వరకు సెల్లార్ తవ్వకాలు నిలిపివేయాల్సి ఉంటుంది. అప్పటికే తవ్వి ఉంటే.. అక్కడ అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలి. రిటైనింగ్ వాల్, బారికేడింగ్ తదితర చర్యలు తీసుకోవాలి. తవ్విన సెల్లార్‌కు నిర్మాణం మొదలై ఉంటే చుట్టు పక్కల భవనాలకు ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలి. అక్రమంగా ఎవరైనా సెల్లార్ తవ్వితే వెంటనే చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.



| జోన్ | పురాతన భవనాలు | కూల్చివేసినవి | మరమ్మతులు | ఖాళీ చేయించినవి | సీజ్ | పెండింగ్ |
|---|---|---|---|---|---|---|
| ఎల్బీనగర్ | 61 | 14 | 14 | 10 | 0 | 23 |
| చార్మినార్ | 128 | 6 | 5 | 9 | 1 | 107 |
| ఖైరతాబాద్ | 87 | 3 | 9 | 4 | 0 | 71 |
| సికింద్రాబాద్ | 108 | 0 | 4 | 4 | 0 | 100 |
| శేరిలింగంపల్లి | 34 | 3 | 4 | 12 | 0 | 15 |
| కూకట్‌పల్లి | 41 | 0 | 4 | 5 | 0 | 32 |

### ఆరు జోన్లలో 459 శిథిల భవనాల గుర్తింపు

గ్రేటర్ పరిధిలో పురాతన భవనాలపై జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నది. వర్షాకాలం నేపథ్యంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన భవనాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని నిర్ణయించిన అధికారులు.. ఆరు జోన్లలో 459 శిథిల భవనాలను గుర్తించారు. గతేడాది 231 శిథిల భవనాలను కూల్చివేయగా, 294 వాటికి మరమ్మతులు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా శిథిల భవనాల విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వానకాల విపత్తుల నివారణలో భాగంగా శిథిల భవనాలను గుర్తించడం, పురాతన భవనాల పటిష్ఠత , భద్రతపై ఇంజినీరింగ్ విభాగాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకరంగా ఉన్న వాటిని కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం సర్వే జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్ల వారీగా సర్వే సంబంధిత భవన నాణ్యతను పరిశీలించి, ప్రమాదకర భవనాలకు నోటీసులు జారీ చేయడం, ప్రమాదకరమైనవి కూల్చివేయనున్నట్లు అధికారులు చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలపై 040-2111 1111కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

### ఆపాలంటూ 'పై' నుంచి ఒత్తిళ్లు

### ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు: మణికొండ మున్సిపల్ కమిషనర్

సిటీబ్యూరో/మణికొండ, మే 24: మణికొండ మున్సిపాలిటీలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఒకటి కాదు రెండు ఏకంగా పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉండటంతో వాటిని కూల్చివేయాలని నిర్ణయించారు. అయితే కూల్చివేతలను ఆపాలంటూ 'పై' స్థాయి నుంచి అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తీసుకొస్తున్నారు. కాగా, శుక్రవారం పంచవటి కాలనీలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, హెచ్ఎండీఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఉన్నతాధికారులు తమ సిబ్బందితో కలిసి సంయుక్తంగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఒకవైపు కూల్చివేతలు జరుగుతున్న సమయంలోనే.. పలువురు బిల్డర్లు ఆపాలంటూ.. ప్రభుత్వంలోని పెద్దల నుంచి మణికొండ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారని అధికారులు తెలిపారు. బహిరంగంగా అక్రమ నిర్మాణాలను చేపట్టి, ఆపై ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి కలిగిన వారికి తాము బంధువులమంటూ తమను భయభ్రాంతులకు గురియచేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ఒకవైపు ఒత్తిళ్లు కొనసాగుతున్నా హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

**ఉపేక్షించేది లేదు..**

నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ స్పష్టం చేశారు. పంచవటి కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న 35 నిర్మాణాలను గుర్తించామన్నారు. శుక్రవారం మూడు అక్రమ నిర్మాణాల స్లాబ్‌లను కూల్చివేసినట్లు వివరించారు. ప్రభుత్వం నుంచి జీప్లస్ 3 అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా ఐదు అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు ఎంతటివవారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలను గుర్తిస్తే వాటిని కూల్చివేయకుండా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.



ఫిలింనగర్ బస్తీలో రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు



బేగంపేటలో పైగా ప్యాలెస్

## హెచ్ఎండీఏ కార్యాలయాలు.. పైగా ప్యాలెస్‌కు

### ఆగస్టు నాటికి తరలించాలని డెడ్ లైన్

### తక్కువ స్థలంలో కార్యాలయాల కూర్పు కష్టమంటున్న ఉద్యోగులు

### 'స్వర్ణజయంతి'లోకి అద్దెకొచ్చేవారు కరువు

### ఇప్పటికే కాంప్లెక్సులో 20-25 శాతం ఖాళీగానే..

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ హెచ్ఎండీఏ. హైదరాబాద్ చుట్టూ 7 జిల్లాల పరిధిలో సుమారు 50 కి.మీ దూరం వరకు విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో పట్టణీకరణతో పాటు పరిశ్రమలు గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా కొత్తగా నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వరకు హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యో ఉద్యోగులు, వివిధ విభాగాలకు ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మొత్తంలో ఆఫీసు స్థలం అవసరం ఉంటుంది. అయితే ప్రస్తుతం అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్సులో ఉన్న హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంతో పాటు హుస్సేన్‌సాగర్ తీరంలో ఉన్న బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయం, అదేవిధంగా నానక్‌రాంగూడలో ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్), అర్బన్ ఫారెస్ట్ కార్యాలయాలను అన్నింటినీ కలిపి బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లోకి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆగస్టు నాటికల్లా తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని డెడ్‌లైన్ కూడా పెట్టింది. దీంతో అధికారులు ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా హెచ్ఎండీఏ కార్యాలయాల తరలింపు ప్రక్రియను మొదలు పెట్టారు. అయితే హెచ్ఎండీఏ కార్యాలయాలన్నింటినీ పైగా ప్యాలెస్‌కు తరలించాలన్న నిర్ణయం పట్ల ఉద్యోగులు అయిష్టత చూపుతున్నట్లు సమాచారం. అక్కడ స్థలం ఏ మాత్రం సరిపోదని..తక్కువ స్థలంలో కార్యాలయాల కూర్పు కష్టసాధ్యమని, ఇప్పుడున్న చోటే ఎంతో బాగుందని, ఎక్కడ ఉండాల్సిన కార్యాలయాలు..అక్కడ ఉంటేనే బాగుంటాయన్న అభిప్రాయం ఉద్యోగుల వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు తెలిసింది.

### 2008 దాకా.. హుడా కార్యాలయం..

బేగంపేటలోని పైగా ప్యాలెస్ భవనంలో 2007 వరకు హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయం కొనసాగింది. ఆ తర్వాత 2008 నుంచి హుడా కాస్తా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీగా అవతరించింది. తార్నాకలోని సొంత భవనంలో సుమారు 13 ఏండ్ల పాటు కొనసాగిన హెచ్ఎండీఏ కార్యాలయం రెండేండ్ల నుంచి అమీర్‌పేటలో సొంత భవమైన స్వర్ణ జయంతి కాంప్లెక్సులో కొనసాగుతున్నది. ఈ కార్యాలయం ఆధునీకరణ కోసం సుమారు రూ.10 కోట్ల దాకా వెచ్చించి అత్యంత అధునాతన, విశాలమైన ఆఫీస్ ప్రాంగణాన్ని హెచ్ఎండీఏ కార్యకలాపాలకు సిద్ధం చేసింది. మొత్తం 5 అంతస్తుల్లో హెచ్ఎండీఏకు చెందిన వివిధ విభాగాలు ఉన్నాయి. ఇవే కాకుండా మరో రెండు చోట్ల హెచ్ఎండీఏకు సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి హుస్సేన్‌సాగర్ తీరంలోని లుంబినీ పార్కు వద్ద బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్, అర్బన్ ఫారెస్ట్ కార్యాలయాలు నానక్‌రాంగూడలోని ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ సర్కిల్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే చోటైన బేగంపేట పైగా ప్యాలెస్‌కు తరలించాలన్న నిర్ణయం పట్ల హెచ్ఎండీఏ ఉద్యోగులే.. సరైన నిర్ణయం కాదంటూ పేర్కొంటున్న పరిస్థితి నెలకొన్నది.

### స్థలాభావమే అసలు సమస్య..

తక్కువ భవన నిర్మాణ స్థలం ఉన్న పైగా ప్యాలెస్‌లో అన్ని విభాగాలకు అనుకూలంగా ప్రత్యేక చాంబర్లు, ఉద్యోగుల కోసం క్యాబిన్లు ఏర్పాటు చేయాలంటే స్థలం సరిపోదనే అభిప్రాయాన్ని హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్సులో హెచ్ఎండీఏ కార్యాలయాన్ని మళ్లీ తరలిస్తే రూ.10 కోట్లు వెచ్చించిన ఫర్నిచర్, ఇంటీరియర్ అంతా వృథా అవుతుంది. మరోవైపు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్సులోకి ప్రైవేటు సంస్థలు అద్దెకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే 8 అంతస్తులుగా ఉన్న భవనంలో 20-25 శాతం ఖాళీగానే ఉంది. మరోవైపు అదే సమయంలో పైగా ప్యాలెస్‌లో కొత్తగా మళ్లీ ఉన్నతాధికారుల చాంబర్లు, క్యాబిన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల అదనంగా కోట్లలోనే మరోసారి ఖర్చు చేయాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. వివిధ విభాగాల విస్తరణ కార్యకలాపాలు పెరిగితే బేగంపేటలోని పైగా ప్యాలెస్ భవనంలోని స్థలం ఏమాత్రం సరిపోదని, ఇప్పటికైనా సర్కారు పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

## ఆడుకుంటున్న పాప.. అంతలోనే..

### హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి.. మృత్యువుతో పోరాటం



వెంగళరావునగర్, మే 24 : మేడపై ఆడుకుంటున్న చిన్నారికి హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడింది. తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి మృత్యువుతో పోరాటం చేస్తున్నది. రహ్మత్ నగర్ డివిజన్ ఎన్ఎస్‌బీ నగర్‌లో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎన్ఎస్‌బీనగర్ ప్రధాన రహదారి పక్కన రమేశ్ అనే వ్యక్తి నివాసముంటున్నాడు. మేడ పై హైటెన్షన్ తీగల కింద ఉన్న గదిలో జీహెచ్ఎంసీలో పనిచేసే యాకయ్య దంపతులు కొన్ని నెలల కిందట అద్దెకు దిగారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో నివాసముండే వీరి మనవడు, మనవరాలు వేసవి సెలవుల ఉన్నాయని ఇటీవల వచ్చారు. శుక్రవారం సాయంత్రం మెడ పై ఉన్న గది ముందు టేప్‌తో మనవరాలు మిల్కీ(8) ఆడుకుంటుండగా.. పైన అతి సమీపంలో ఉన్న హైటెన్షన్ తీగలు తగలడంతో విద్యుదఘాతానికి గురై శరీరం కాలిపోయింది. స్థానికులు దవాఖానకు తరలించగా, పాప పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## దైవదర్శనానికి వెళ్లి వస్తూ.. మృత్యుఒడికి..

### కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

### ముగ్గురు ప్రాణ స్నేహితుల దుర్మరణం



మణిదీప్ గౌడ్ (ఫైల్)



శివకృష్ణ వరప్రసాద్ (ఫైల్)



మేగావత్ అఖిల్ (ఫైల్)

చంపాపేట, మే 24: వారంతా ప్రాణ స్నేహితులు.. దైవదర్శనానికి వెళ్లి.. ఎంతో ఆనందంగా తిరుగు ప్రయాణమయ్యారు.. ఇంకో గంటలో ఇంటికి చేరుకునేవారే.. అంతలోనే బస్సు రూపంలో మృత్యువు కబళించింది. రాంనుంతల గేట్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు దుర్మరణం పాలయ్యారు. గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన బుర్ర శ్రీనివాస్ గౌడ్ లక్ష్మి దంపతులు 30 ఏండ్లుగా చంపాపేట డివిజన్ బైరమాల్‌గూడ సాయినగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఓ కుమారుడు అనిల్ గౌడ్ యూఎస్‌లో ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు బుర్ర మణిదీప్‌గౌడ్ (25) నగరంలో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మణిదీప్‌గౌడ్, హస్తినాపురం డివిజన్ ద్వారకానగర్ కాలనీకి చెందిన శివకృష్ణ వరప్రసాద్ గౌడ్ (25), బాలాపూర్‌లో ఉండే నల్లగొండ జిల్లా నాంపల్లి రాందాస్ తండాకు చెందిన మేగావత్ అఖిల్ (26) ఈ ముగ్గురు ప్రాణ స్నేహితులు. గురువారం వీరంతా కలిసి కారులో దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లారు. శుక్రవారం తిరుగు ప్రయాణమవ్వగా, మణిదీప్ గౌడ్ కారును నడుపుతున్నాడు. ఆమన్‌గల్ సమీపంలోని ప్రధాన రహదారిలో ఉండే రాంనుంతల గేట్ వద్దకు రాగానే శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఘటనాస్థలిలోనే ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.


## విలేకరులు కావలెను

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రిక

హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ క్రింది ప్రాంతాల్లో పనిచేసేందుకు పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను.

**గ్రేటర్ హైదరాబాద్**

1. గాజుల రామారం
2. గాంధీ ఆస్పత్రి
3. కూకట్‌పల్లి
4. రసూల్‌పుర
5. ఘట్‌కేసర్ రూరల్
6. సంతోష్‌నగర్
7. మహేశ్వరం
8. పహాడీషరీఫ్
9. చాంద్రాయణగుట్ట
10. గౌతమ్‌నగర్
11. అల్వాల్

**రంగారెడ్డి**

1. శంకర్‌పల్లి
2. కేశంపేట
3. కొందుర్గు
4. చౌదరిగూడ

**వికారాబాద్**

1. తాండూర్ టౌన్
2. వికారాబాద్ రూరల్
3. బంట్వారం
4. కోట్‌పల్లి
5. మోమిన్‌పేట

పరీక్ష తేది : మే 28 (2024) మంగళవారం

సమయం: మధ్యాహ్నం 2 గంటలకు

పరీక్షా కేంద్రం : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం బంజారాహిల్స్ - హైదరాబాద్